క్లుప్తంగా

గౌడ సంఘం అధ్యక్షుడిగా శంకర్



టేకుమట్ల(రేగొండ): రేగొండ గౌడ సంఘం నూతన కమిటీని శ్రీ రేణుక ఎల్లమ్మతల్లి ఆలయంలో ఆయల చైర్మన్ మోడెం ఉమేష్‌గౌడ్, గౌడ సంఘం నాయకుల ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా అధ్యక్షుడిగా మాడగాని శంకర్‌ను శుక్రవారం రెండో సారి ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. గౌడసంఘం హక్కుల సాధనకు కృషి చేస్తూ, సంఘం బలోపేతానికి నిరంతరం కృషి చేస్తానని అన్నారు. తన ఎన్నికకు సహకరించిన గౌడ సంఘం నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గండి శంకర్, పోడేటి సుదర్శన్, తమాడగాని రాంచందర్, తడక సతీష్, పోడేటి రవి, తదితరులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశం



మహదేవపూర్: మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధిహామీ సిబ్బందితో జెడ్పీ సీఈఓ విజయలక్ష్మి శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఉపాధిహామీ పథకం కింద చేపట్టిన పనులకు జీయో టాగింగ్ పూర్తి చేయాలన్నారు. గ్రామ పంచాయతీల తీర్మానంతో నూతన పనులు చేపట్టాలని ఆదేశించారు. అంతకుముందు మండలంలోని అన్నారం గ్రామంలో హరితహారం సంపద వనాలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రాణిబాయి, ఎంపీడీఓ రవీంద్రనాథ్, ఎంపీఓ ప్రసాద్, ఏపీఓ రమేష్, ఈసీ మంగిలాల్ పాల్గొన్నారు.

వైద్య విద్యార్థికి చేయూత



మహాముత్తారం: మండల కేంద్రానికి చెందిన తేజ అనే విద్యార్థి ఇటీవల వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ సీటు సాధించాడు. నిరుపేద విద్యార్థి కావడంతో చదువుల నిమిత్తం మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు ఆదేశాల మేరకు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో శుక్రవారం రూ.25వేలు ఆర్థిక సాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ శాంతకుమార్, మాజీ ఎంపీపీ మెండ వెంకటస్వామి, రైతు సమితి మండలాధ్యక్షుడు మార్క రాము, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు రాజు తదితరులు ఉన్నారు.

పరామర్శ



చిట్యాల: మండలంలోని చింతకుంటరామయ్యపల్లి గ్రామానికి చెందిన గొపగాని సతీష్ ఇటీవల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబాన్ని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ చందుపట్ల కీర్తిరెడ్డి శుక్రవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు బుర్ర వెంకటేష్ గౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి నిషిధర్‌రెడ్డి, దాసరి తిరుపతి రెడ్డి, అఖిల్, కొమురయ్య తదితరులు ఉన్నారు.

అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దు



మహాముత్తారం: గ్రామస్తులతో మాట్లాడుతున్న పోలీసులు



మహదేవపూర్: మాట్లాడుతున్న ఎస్సై రాజ్‌కుమార్

మహాముత్తారం: ప్రజలు గ్రామాల్లో అనుమానితులకు ఆశ్రయం ఇవ్వొద్దని ఎస్సై సుధాకర్ అన్నారు. మావోయిస్టు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో భాగంగా మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఉండేందుకు ముందస్తు చర్యల్లో భాగంగా మండలంలో రెండు రోజుల నుంచి పోలీసులు కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం, కార్డన్ సెర్చ్ నిర్వహిస్తున్నారు. ఈ మేరకు శుక్రవారం మండలంలోని పోశంపల్లి గ్రామంలో ఎస్సై ఆధ్వర్యంలో ఇంటింటా సోదాలు నిర్వహించారు. గ్రామంలో ఎంతమంది నివసిస్తున్నారు అని ఆధార్ కార్డు ఆధారంగా తనిఖీలు చేపట్టారు. గ్రామంలో ఎవరైనా కొత్త వ్యక్తులు నివసిస్తున్న వారి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చిన ట్లెతై పోలీసులకు సమాచారం అందించాలన్నారు. గ్రామంలో గుడుంబా తయారు చేసినా అమ్మినా వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత మద్యం, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎస్సై వెంట సీఆర్‌పీఎఫ్, సివిల్ పోలీసులు తదితరులు ఉన్నారు.



టేకుమట్ల: తనిఖీ చేస్తున్న ఎస్సై సుధాకర్

అసాంఘిక శక్తులపై జాగ్రత్తగా ఉండాలి

టేకుమట్ల: అనుమానితులు, అసాంఘిక శక్తులపై ప్రజలు జాగ్రత్తగా ఉండాలని ఎస్సై గట్ల సుధాకర్ అన్నారు. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంతో పాటు పరిసర ప్రాంతాల్లో విస్తృతంగా వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించి, వివరాలను సేకరించి వదిలిపెట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లో ఎవరైనా అనుమానిత వ్యక్తులు సంచరిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ రమేష్, కానిస్టేబుల్ సుమన్, టీఎస్ఎస్పీ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మావోయిస్టులకు సహకరిస్తే చర్యలు

మహదేవపూర్: మావోయిస్టులకు సహకరించవద్దని ఎస్సై రాజ్‌కుమార్ తెలిపారు. శుక్రవారం ఎనుకపల్లి గ్రామంలో పోలీసులు కార్డన్‌సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనంతరం ఎస్సై గ్రామస్తులతో మాట్లాడుతూ.. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండ కష్టపడి ఉన్నత స్థాయికి చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సిఆర్పీఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.

చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు



రౌడీ షీటర్లతో మాట్లాడుతున్న ఎస్సై అభినవ్

కాటారం: చట్టాన్ని అతిక్రమించి ప్రవర్తిస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై అభినవ్ హెచ్చరించారు. మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం మండల పరిధిలోని రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఎలాంటి క్రిమినల్ కేసుల్లో జోక్యం చేసుకోవద్దని బెదిరింపులు, దాడులను ప్రోత్సహించే వంటి చర్యలకు పూనుకుంటే చట్ట ప్రకారం కేసులు నమోదు చేసి జైలుకు పంపిస్తామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కల్గించకుండా ప్రజల్లో మమేకమై ప్రశాంతమైన జీవితం గడపాలని సూచించారు. ఎలాంటి చిన్న ఫిర్యాదులు అందిన ఊరుకునేది లేదని తెలిపారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పుట్ట మధు

మహదేవపూర్: మండల కేంద్రానికి చెందిన 26 మంది కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు శుక్రవారం బీఆర్‌ఎస్ పార్టీ మంథని నియోజకవర్గం ఇన్‌చార్జ్ పుట్టమధు సమక్షంలో పార్టీలో చేరారు. బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు లింగంపల్లి శ్రీనివాసరావు, సర్పంచ్ శ్రీపతిబాపు, కార్యకర్తలు రాజయ్య, శ్రీను, మహేందర్, మహేష్, మల్లయ్య, పిట్టల రాజయ్య, స్వామి, సలేంద్రం పోషన్న, బల్ల వెంకటస్వామి, గద్దం సమ్మయ్య, సుంకరి సంపత్, నరేందర్, పోతుల దుర్గయ్య తదితరులు ఉన్నారు.

తపాలా సేవలను సద్వినియోగం చేసుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ దావు వినోద

చిట్యాల: తపాలా సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి కోరారు. శుక్రవారం మండలంలోని చల్లగరిగ గ్రామ పంచాయతీ పరిధిలో డాక్ కమ్యూనిటీ డెవలప్‌మెంట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి హాజరై మాట్లాడుతూ.. తపాలా శాఖ అందిస్తున్న బీమా పాలసీలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. అలాగే భూపాలపల్లి పోస్టల్ సబ్ డివిజన్ ఇన్‌స్పెక్టర్ భూక్యా విజయ్ మాట్లాడుతూ.. ప్రజా ప్రతినిధుల సహకారంతో ప్రజలలో తపాల పొదుపు పథకాలపై అవగాహన కల్పిస్తున్నట్లు తెలిపారు. పోస్టు ఆఫీస్ అందిస్తున్న పథకాలు ప్రతి ఇంట్లో ఉపయోగపడే విధంగా ఉంటాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తపాలా సిబ్బంది నరేష్, సురేష్, సందీప్ రెడ్డి, రాజు, గ్రామస్తులు బండి రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

కేసు నమోదు చేయాలి



మాట్లాడుతున్న మహేందర్

కాటారం: మండలంలోని ఒడిపిలవంచ గ్రామానికి చెందిన ఎస్సీ కులస్తులు వావిళ్ల రవి, వావిళ్ల లింగయ్యలను తీవ్రపదజాలంతో దూషిస్తూ దాడి చేసి గాయపర్చిన అదే గ్రామానికి చెందిన గోపాల్‌పై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలని కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం జిల్లా అధ్యక్షుడు ఇసునం మహేందర్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మహేందర్ మాట్లాడుతూ.. ఎస్సీ కులస్తులను కులం పేరుతో దూషించి దాడి చేసిన సంఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. విచారణ జరిపి గోపాల్‌ను తక్షణమే అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించాలని తెలిపారు. బాధితులకు న్యాయం జరగకపోతే కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మండల అధ్యక్షుడు కాసిపేట కుమార్ ఉన్నారు.

బాధిత కుటుంబాలకు ఆర్థికసాయం



పరామర్శిస్తున్న గండ్ర జ్యోతి



ఆర్థిక సాయం అందిస్తున్న కోటగిరి సతీష్‌గౌడ్

టేకుమట్ల(గోరికొత్తపల్లి): గోరికొత్తపల్లి మండలంలోని వెంకటేశ్వర్లపల్లి గ్రామానికి చెందిన బానోతు జోగ్యానాయక్, వేముల రవి, బండారు కొమురయ్యలు ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షురాలు, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ గండ్ర జ్యోతి పరామర్శించి ఒక్కో కుటుంబానికి రూ.5000 ఆర్థిక సాయం అందించారు. ఆమె వెంట బీఆర్‌ఎస్ మండల నాయకులు ఉన్నారు.

ఎంపేడులో..

టేకుమట్ల: మండలంలోని ఎంపేడు గ్రామానికి చెందిన బొల్లి రాజయ్య ఇటీవల ఆత్మహత్య చేసుకున్నాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కోటగిరి సతీష్‌గౌడ్ శుక్రవారం పరామర్శించి రూ.2000 ఆర్థిక సాయం అందించారు. ఆయన వెంట ఇసంపెల్లి పోశాలు, మొగిళి, శ్రీనివాస్, శ్రీనివాస్, తిరుపతి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

పౌష్టికాహారం అందజేత



పౌష్టికాహారం అందజేస్తున్న శిరీష

వెంకటాపురం(కె): మండల పరిధిలోని బర్లగూడెం పంచాయతీలో శుక్రవారం అంగన్‌వాడీ సెంటర్స్‌లోని గర్భిణులకు, బాలింతలకు, చిన్నారులకు పౌష్టికాహారాన్ని సీడీపీఓ శిరీష అందజేశారు. అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు సమ్మె చేస్తుండటంతో ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పంచాయతీలలో అంగన్‌వాడీ సెంటర్లకు స్టాక్‌ను తరలించి అక్కడి బాలింతలకు చిన్నారులకు అందజేస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు పుష్పవతి, స్వరూప, శిరీషతో పాటు తదితరులు ఉన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి



వంటసామగ్రిని పరిశీలిస్తున్న ఎంపీడీఓ శంకర్‌నాయక్

కాటారం: గురుకుల పాఠశాల, కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని ఎంపీడీఓ శంకర్‌నాయక్ ప్రధానోపాధ్యాయురాలు, సిబ్బందికి సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాలను శుక్రవారం ఎంపీడీఓ తనిఖీ చేశారు. పాఠశాల, కళాశాలలో విద్యార్థుల, ఉపాధ్యాయుల, అధ్యాపకుల హాజరుపట్టిక, కిచెన్, తరగతి గదులను పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రత, సౌకర్యాలు, సమస్యలపై ఆరా తీశారు. విద్యాబోధన, మెనూ ప్రకారం భోజనం అందుతుందా లేదా అని విద్యార్థినులను ఎంపీడీఓ అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినీలకు మెనూ ప్రకారం భోజనం అందించడంతో పాటు నాణ్యమైన విద్యాబోధన జరిగేలా చూడాలని పేర్కొన్నారు. విద్యార్థినుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఎంపీడీఓ వెంట ప్రిన్సిపాల్ లలితాదేవి, ఉపాధ్యాయులు ఉన్నారు.

నిందితుడిని కఠినంగా శిక్షించాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజమ్మ

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో ఇటీవల వివాహిత మహిళపై అత్యాచార యత్నానికి ప్రయత్నించిన పీఏసీఎస్ డైరెక్టర్ సురేష్‌ను ప్రభుత్వం, పోలీస్‌శాఖ అధికారులు కఠినంగా శిక్షించి, బాధితురాలికి న్యాయం చేయాలని మాజీ జెడ్పీటీసీ, కాంగ్రెస్ పార్టీ మహిళ మండల అధ్యక్షురాలు కొండ రాజమ్మ డిమాండ్ చేశారు. శుక్రవారం తాడిచర్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాజమ్మ మాట్లాడుతూ.. బజ్జీలు అమ్ముకొని జీవనం సాగిస్తున్న నిరూపేద మహిళ చీరలు అడ్డుగా కట్టుకుని బాత్రూమ్‌లో స్నానం చేస్తూంటే సురేష్ అనే వ్యక్తి అందులోకి చొరబడి ఆమెపై అత్యాచార యత్నానికి ప్రయయత్నం చేశాడని తెలిపారు. దీంతో బాధిత మహిళ అవమానం భరించ లేక పురుగుల మందు తాగి చావుబతుకుల్లో ఉందన్నారు. బీఆర్‌ఎస్ నాయకుడు ఈ అఘాయిత్యానికి పాల్పడటాన్ని కాంగ్రెస్ పార్టీ తరుపున తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. నిందితున్ని అధికార పార్టీ నాయకులు, పోలీసులు వత్తసూ పలుకుతూ పేద మహిళకు అన్యాయం చేసే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షురాలు బిర్నేని బానక్క, ఉపాధ్యాక్షురాలు పల్లెర్ల కవిత, తాండ్ర శాంతమ్మ, స్వప్న, పద్మ, రమ, రజిత, లింగమ్మ, గట్టమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల వివరాల సమాచారం ఇవ్వాలని వినతి

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో నిర్మించుకున్న ఇళ్ల ఇంటి పన్ను రసీదు వివరాలను సమర్పించాలని తాడిచర్ల గ్రామానికి చెందిన ఇందారపు శివకుమార్ తెలంగాణ రాష్ట్ర సమాచారం కమీషన్‌కు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. ఈసందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ.. 2019–2022 సంవత్సరం వరకు నూతనంగా నిర్మించుకున్న ఇళ్లకు సంబంధించి గ్రామ పంచాయతీ డిమాండ్ రిజిస్టర్‌లో నమోదు చేసిన పేర్ల వివరాలతో సహా బ్లాక్ వైజ్‌గా మాన్యువల్, ఆన్‌లైన్ రసీదులు ఇవ్వాలని గ్రామ పంచాయతీలో సహచార హక్కు చట్టం ద్వారా 26–09–2022 వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. అయిన కూడా ఇప్పటి వరకూ సమాచారం ఇవ్వలేదన్నారు. అలాగే 23–02–2023లో ఎంపీడీఓ కార్యాలయంలో అప్లై చేసిన సమాచారం రాలేదని పేర్కొన్నారు. ఈ మేరకు సమాచారం ఇప్పించాలని రాష్ట్ర సమాచర కమిషన్‌కు వినతిపత్రం సమర్పించినట్లు ఆయన వెల్లడించారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్ఐకి వినతిపత్రం ఇస్తున్న ఆశ కార్యకర్తలు

మల్హర్: ఆశ వర్కర్లు ఎదుర్కోంటున్న సమస్యలను పరిష్కరించాలని మండలంలోని తాడిచర్ల రెవెన్యూ కార్యాలయంలో ఆర్ఐ సరితకు శుక్రవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆశ కార్యకర్తలు మాట్లాడుతూ.. రూ.18వేల పారితోషికం పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పీఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు, ప్రమాద బీమా సౌకర్యం రూ.5లక్షలు ఇవ్వాలని తదితర సమస్యలు పరిష్కరించాలని వినతిలో పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

ఏటూరునాగారం: సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని మల్లారెడ్డి కళాశాల ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ పరప్ప సంజన్ తెలిపారు. మండలంలోని చింతలమోరి గొత్తికోయగూడెం, మంగపేట మండలంలోని గూడేల్లో హైదరాబాద్ మల్లారెడ్డి మెడికల్ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. 350 మందికి వైద్య పరీక్షలు చేసినట్లు డాక్టర్ తుమ్మ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డాక్టర్లు శాంతన్, స్వేత, దినేష్‌రెడ్డి, చంద్రశేఖర్, సుషాంత్, 17 మంది జూనియర్ వైద్యులు, ఫార్మాసిస్ట్, స్టాఫ్ పాల్గొన్నారు.

వెంకటాపురం(కె): మండల పరిధిలోని కొండాపురం, బోదాపురం, వాడగూడెం గ్రామాల్లో వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్యశిబిరాలను శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు వైద్య పరీక్షలను నిర్వహించడంతో పాటు రక్త నమూనాలను సేకరించి మందులను అందజేశారు. అనంతరం గ్రామస్తులకు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది ఉన్నారు.

మంగపేట: సీజనల్ వ్యాధుల భారిన పడకుండా ఉండేందుకు ప్రజలు ఆరోగ్య జాగ్రతలు తప్పక పాటించాలని బ్రాహ్మణపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి కారం నిఖిల్ కుమార్ అన్నారు. మండలంలోని ఉప్పరకాలనీలో ప్రత్యేక వైద్యశిబిరాన్ని శుక్రవారం నిర్వహించారు. డ్రైడే ఫ్రైడే కార్యక్రమాన్ని పురస్కరించుకుని గ్రామంలో వైద్య సిబ్బందితో ర్యాపిడ్ ఫీవర్ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని సుమారు 72 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

గణేశ్ మండపం వద్ద దీపాలతో మహిళలు



దీపారాధన మహోత్సవం

కాటారం: గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని గారెపల్లిలో ఏర్పాటు చేసిన గణపతి వద్ద మహిళలు శుక్రవారం దీపారాధన మహోత్సవం నిర్వహించారు. ఓం, తామర పూవు ఆకృతిలతో దీపాలను వెలిగించారు.

ముమ్మరంగా పారిశుద్ధ్య పనులు



ఏటూరునాగారం: నినాదాలు చేస్తున్న జీపీ, వైద్య, సెర్ప్ సిబ్బంది



వాజేడు: చెత్త ఎత్తుతున్న సిబ్బంది



ఏటూరునాగారంలో..



వాజేడు: కాల్వల్లో ఆయిల్ బాల్స్ వేస్తున్న ప్రజాప్రతినిధులు, సిబ్బంది

వాజేడు: మండల పరిధిలోని మొరుమూరు గ్రామ పంచాయతీలో శుక్రవారం స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమంలో భాగంగా పారిశుద్ధ్య పనులు చేపట్టారు. గ్రామస్తులతో పాటు ఎంపీపీ శారద చెత్తను ఎత్తడంతో పాటు పిచ్చి మొక్కలను తొలగించారు. పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. మొరుమూరు గ్రామ పంచాయతీలో ఉన్న నీటి గుంతల్లో ఆయిల్ బాల్స్ వేశారు. సైడ్ కాల్వల్లో నిలువ ఉన్న నీటిని తొలగించారు.

ఏటూరునాగారంలో..

ఏటూరునాగారం: బహిరంగ మల విసర్జన ప్రమాదకరమని గ్రామ పంచాయతీ కార్యదర్శి రమాదేవి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని 5వార్డులో సబ్‌సెంటర్ ఆవరణలో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలోభాగంగా పలురకాల ప్రతిజ్ఞలను ప్రజలు, మహిళలనుతో చేయించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. ప్రతీ ఇంటిలో మరుగుదొడ్డి నిర్మించుకోవాలన్నారు. ఇళ్ల చుట్టూ నీరు నిల్వలు లేకుండా చూడాలన్నారు. తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా వేయాలన్నారు. అదేవిదంగా మండలంలోని గ్రామ పంచాయతీల్లోని పరిధిలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాలను చేపట్టారు. చెత్తాచెదారం తొలగించడం, బ్లీచింగ్, క్లోరినేషన్, ఇంటింటాకి వెళ్లి వ్యాధుల నివారణపై చర్యలు తీసుకునే విధంగా అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జీపీ రవీందర్, వెంకన్న, సెర్ప్ ఏపీఎం పాషా, సీసీలు, వీఓఏలు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు. అలాగే రాంనగర్ గ్రామంలో ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని చేపట్టినట్లు కార్యదర్శి లక్ష్మీనారాయణ తెలిపారు.

కుంకుమ పూజ



పూజలు చేస్తున్న మహిళలు

మహదేవపూర్: మండల కేంద్రంలో పలు గణపతి మండపల వద్ద శుక్రవారం మహిళలు కుంకుమ పూజలు నిర్వహించారు. జాతీయ రాహదారిపై ఏర్పాటు చేసిన గణపతి మండపం వద్ద కాళేశ్వర ముక్తేశ్వర దేవాలయ కమిటీ డైరెక్టర్ పద్మ ఆధ్వర్యంలో మహిళలు పాల్గొని పూజలు చేశారు. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గణపతి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
జయశంకర్ భూపాలపల్లి :
9951602872
Office mail : wglsakshiadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
ఎ. మహేష్ (S.R) : 9505555291
కె. సుధాకర్ (ACO) : 9177258410